ఎక్సురే ౩౪

# క్లబ్బు

"విహారి"

క్లబ్బు అంటే పెద్దలదగ్గరినుంచి చిన్నల వరకూ వూసుపోనివాళ్ళకి కాలక్షేపానికి యేర్పడ్డ వో మనోవినోదస్థానం. టౌన్లలో జీతాల్నిబట్టీ, పై ఆదాయాల్నిబట్టీ, వ్యక్తుల ఔదార్యసామర్థ్యాల్నిబట్టీ వేరువేరు గ్రేడ్లలో వుంటాయి క్లబ్బులు. కాని క్లబ్బు యొక్క వ్యుత్పత్త్యర్థం మాత్రం వొకటే. దినమంతా తమ తమ పన్లలో చెదలుపట్టేదాకా కూలబడివుండేవాళ్ళకి క్లబ్బు సాయంతన సమయాల్లో యింత రిక్రియేషన్ కలిగించి, శ్రమను పోగొడుతుంది. హైక్లాసు క్లబ్బుల్లోమాత్రం చీకటి అయ్యేకొద్దీ ఆనందావేశం అధికమౌతుంటుందని అనంగా వింటుంటాం. వాట్నుంచి మనం యెంత దూరంలోవుంటే అంతక్షేమం. కాబట్టి వో మామూలు క్లబ్బు వ్యవహారం చూచుకుందాం.

సాధారణంగా వీధుల్లో, యిళ్ళల్లోచేస్తే ప్రజలకు యిబ్బందీ, సోమరితనం కలిగించే కార్యాలు సైతం ఆచరించడానికి నిజానికి క్లబ్బు లైసన్సు పొందిన స్థలంలావుంటుంది. టెన్నిసు, బ్యాడ్మింటను, క్యారం, పేకాటా వగైరా క్లబ్బుల్లోని కాలక్షేపకార్యక్రమాలు. మొదట్లో ఆవూరి క్లబ్బులోగూడా యివన్నీ వున్నాయిట. ఆవూర్ని దర్శించడానికి నేను వెళ్ళినపుడుమాత్రం అవన్నీలేవుగాని, సాయంతనసమయం అయ్యేసరికి క్లబ్బు సంతమాదిరిగా కళకళ్ళాడుతూ కడుపునిండేట్టుగా వుంటూవొచ్చింది. 'లోపాయికారీ వ్యవహారాలన్నీ అవగతం చేసుకోడం నాపని కాబట్టి, కొంతకాలంవరకూ నేను ఆ వూళ్ళోనే వుండిపోయ్యా.

"వూరు—వూరు" అన్నంతమాత్రంతో అదో పల్లెటూరని భావింపవలసినపన్లేదు. పూర్తిగా కాకున్నా చాలామట్టుకి టౌనుకి వుండవలసిన లక్షణాలన్నీ వున్నాయి ఆవూరికి. కచ్చేరీ, మొదలు హైస్కూలువరకూ కార్యాలయాలు వున్నాయి. పాలూ, పెరుగూ, కూరలూ—నారలూ, ప ని మ ను షు లూ, దాసీలూ, వీటిధర మహాజోరుగావుంది. మురుగుకాలవలూ, మూలకో బ్లాకౌటులేని రోజుల్లోకూడా ఆ కార్యాన్ని నియమంగానూ, నిష్కర్షగానూ జరుపుతుండే లాందరూ, అలగ్ అలగ్‌గా పశువధ్యశాలా, మార్కెట్టూ, పాకీదొడ్లూ వగైరావున్నాయి. యింక టౌను కాదనడం యెలా?

సాయంత్రమయ్యేసరికి పై నుంచి కింది వరకూ వుద్యోగస్తులూ, వూరిపెద్దలూ క్లబ్బుకి వొచ్చేశేవారు. ఆరోజుల్లో కొన్ని మనోవైషమ్యాలు కారణంగా అక్కడవుండే అన్ని యెంగేజిమెంట్లూ నిలిచిపోయినా పేకాటమాత్రం క్లబ్బుకు యేలాటి లోపం రాకుండా యెక్కడజూచిన తానయై మర్యాద కాపాడుతూ సభ్యులను ఆనందసముద్రంలో ముంచుతూవుంది. శ్రద్ధగా యెవరూ చదవడం లేకపోవడం కారణంగా అంతవరకూ వొస్తూన్న మెయిలు నిలిచిపోయి ప్రకృతం ఆంధ్రపత్రిక మాత్రం వొస్తూంది. దాన్ని కూడా యెవ్వరూ ఖాతిరీచెయ్యకపోవడంవల్ల రోజూ నాకు అది సులభంగానే దొరికేది. వోకన్ను దానిమీదా, మరోకన్ను పరిసరాల్లో జరుగుతుండే వ్యవహారాలమీదావేసి రోజూ వో గంటసేపటివరకూ అక్కడే నేను కూచుంటూవచ్చా. ఆ క్లబ్బువల్ల ఎవరు బాగుపడ్డా, యెవరు బాగుపడకున్నా, అయ్యరు తత్వాన్ని బాగా అర్థంచేసుకుని అక్కడే వోపెట్టె దుకాణాన్ని స్థాపించి, సోడా లైంజూస్....కారాకిళ్ళీ—సాదాబీడా (జరదా మిశ్రమంతో సహా)....బీడీ—సిగరెట్.... తాజా గర్మాగరం చా—ల వ్యాపారం విరివిగా జరుపుతున్న బాచ్చా సాయిబుమాత్రం బాగుపడ్డాడు. వో డాబాకిగూడా బునాది వేయించాడు. కన్నతల్లిలాంటి దుకాణం పెట్టె (పోర్టబుల్‌షాపు)ని వొదిలివెళ్ళడు గాని, క్లబ్బులోకేవెళితే కుర్చీయిచ్చి "కమాన్ సాహెబ్" అనకుండావుండడానికి వొకరికీ దొమ్మలేదు నిజానికి.

యింక లోనివ్యవహారం చూద్దాం. క్లబ్బులో నెలకు పదులూ యిరవైలూ పరదేశాల పాలుజేశే ఆటలన్నీ నిలిచిపొయ్యాయి. అర్ధరూపాయతో ఆరువారాలు మొదలు ఆరునెల్లవరకూ గ్రేడువారీగా వాడదగ్గ యిస్పేటు పేకలే అంతమందికీ యెంగేజిమెంటు యిస్తున్నాయి. "నవనీతం" మొదలు "మున్నూటానాలుగు"వరకూ ఆటలకు జాఖా! యేడేనిమిది గ్రూపులు కనీసంగా పనిలోవుండేవి ప్రతి సాయాహ్నమూనూ. వో మున్నూటి ఆటకు తప్ప తతిమ్మా ఆటలన్నిట్లో నాలుగు నాలుగు తలలకే పనివున్నా, వొక్కో ఆటగాడికి సపోర్టుగా తలనిక్కబెట్టీ, మోకరించీ, సగంవొంగీ, మరోడి బుజాలమీద జార్లపడీ వివిధభంగిమాల్లో అయిదారుగురికి తక్కువ లేకుండా యెంగేజి అవుతుండేవారు అక్కడ క్షణక్షణానికీ ప్రవహిస్తుండే రసాన్ని జుర్రుకుంటూ. ఆ గ్రూపుల్లోనూ తాహతునుబట్టి

పాయంటుకు అణా మొదలు, ఆట ఒకటికి వో జాడీబీడీవరకూ గ్రేడ్లువున్నాయి. తాహతును అనుసరించి పై వారు కిందికీ, కింది వారు పైకీ వొస్తూ పోతూ వుండొచ్చు. దీనికి హోదాలు గట్రతో పనేలేదు. దేశంలో యీ స్థానమనీ, ఆస్థానమని గుంజులాడుతుండే యీ రోజుల్లోకూడా యిదే దేశంలోవుండే వొహవూళ్ళో యిలా కులమతతత్వాలూ, అంటుముట్టుదోషాలూ, పాల్యపాలకభావాలూ, జ్యేష్ఠ కనిష్ఠభేదాలూ యేకోశానా లేకుండా, భాయీ—భాయీగావుంటుంటే వో రుష్యాశ్రమంలా తోచింది. యిదేవిధంగా దేశం అంతావుంటే యింక కావలసిందేముంది!

పూర్వోక్తకార్యక్రమం సాయంకాలం నాలుగ్గంటలకి ఆరంభమై వొక్కోనాడు రాత్రి పదకొండువేసేవరకూ సాగుతూనే వుంటుంది. దీనికి అయిదారు దీపాలు కనీసం కావాలి. వాటికి నూని; కూచోడానికి చాప చింపులూ; ప్యూనుజీతం వీటినన్నిట్నీమించిన పేకల కొనుగోలూ, యిన్నిటికీ మూలధనం వుండాలి, కాని, అలాంటిదేమీ లేనందువల్ల, వొక్కో సభ్యుడు నెలకో పావలా యిచ్చుకోవాలని నిర్ణయం చేసుకున్నారు. యీవిధంగా కొంతకాలం గడిచిపోయింది.

ఫార్మాలిటీకోసం పదిమందిలో యేలాంటి నిర్ణయాలు చేసుకున్నా, అవన్నీ అమల్లోవుండాలని వాదించడం చాలా పొరపాటు. కాగితాలమీది వ్యవహారాలువేరు—జరుగుతుండే వ్యవహారాలువేరు. యీరెంటికీ యెంతకాలం సంబంధం లేకుండావుంటుందో, అంతకాలమూ యేలాటి చిక్కులూ, జగడాలూరావు. యిరవయ్యోశతాబ్దపు నాగరికత గూడా లోటురాదు. కాని అందుకు వ్యతిరేకంగా యేమాత్రం "కూ" అన్నా రసాభాసం జరిగిందన్నమాటే. క్లబ్బు జవాను విద్యావిహీనుడు అవడంవల్ల యీ కీలకం తెలీక, పెద్దా....చిన్నా తారతమ్యం యెరక్క అందరిదగ్గరికీ చందాకు వెళ్ళాడు. ఒకటి రెండునెలు యేదోవిధంగా వసూలైనా, వూరికి పునాదుల్లాంటి పెద్దలు చాలామంది యీ జవాను పొగరుమోతుతనానికి అసహ్యపడ్డారు. కొందరు యేదో వంకతో గద్దించి పొమ్మన్నారు; కొందరు "నీకు మర్యాద తెలీదు వెళ్ళు," అని సాగనంపారు; కొందరు "చూద్దాంలే పద," అన్నారు; మరి కొందరు పలకనేలా! కొందరు ప్రభువులూ, మరి కొందరు ఆఫీసర్లూ, యింక కొందరు ఊరివారూ కాబట్టి ఖాదరు యేమీ అన్లాక పొయ్యాడు. యింక యెటొచ్చీ బడిపంతుళ్ళు మిగిలిపొయ్యారు. వీరిలో వొకరైనా పైవారిలా జవాన్ని అనడానికి యేలాటి క్వాలిఫికేషనూ కలవారుకారు. "అరియర్సు పడితే యేనాటికైనా క్లబ్బువారే రైటాఫ్ చేసుకుంటారులే" అనుకునేంత దొమ్మకూడాలేదు. యేం చెయ్యాలి? "యెవరి పాపం వాళ్ళదే"నని వొకరూ, "వొకరి సంగతిమనకేం మనంమాత్రం యిద్దాం" అని మరికొందరూ, తమ తమ చందాల్ని ప్రతినెలా చెల్లిస్తూనే వొచ్చారు. కొన్నినెల్లుగడిచాయి. యిప్పటు కాగితాలు కొత్తవి కొనడానికి పైసా లేకపోవడంవల్ల మాసి తోళ్ళలా అయిపొయ్యాయి. అయినా పనిమాత్రం నిలవలా, నిరాఘాటంగా జరిగిపోతూంది.

వూళ్ళో స్వామివారి తిరుణాల వొచ్చింది. ఆసందర్భంలో ధనవంతులు కొందరు కాంట్రాక్టు పద్ధతిమీద వో డ్రామా పురమాయించి మరింత పైసా గణిద్దామనుకొన్నారు. పెద్ద పెద్ద నటకులకు ఫలానా విధంగా మర్యాదచేస్తాం-యిక్కడ ఫలానా తేది-ఫలానా నాటకం వెయ్యాలి, అంటూ జాబులు రాశారు. సినిమాల్లో యిరుక్కొని కొందరు రావడానికి వీలులేదని రాశారు. నాటకాల మీది అభిమానం చొప్పున్నేం, తాత్కాలికంగా అన్య కార్యాలు లేకపోవడం వల్లనేం, కొందరు మాత్రం "డానూ పోనూ ఛార్జీలూ ఖర్చులూ వోనాటకానికి 150, 70, 35, 15 కలిపి ముందుగా పంపితే వస్తాం" అంటూ దయతో రాశారు. వీరైనా నాటకాలరోజుల్లో దర్శనానిగ్గూడా అందనివారే. యిలా అవడం ఊరి తిరుణాల స్వామివారి అదృష్టమని చాలా మంచి అనుకున్నారు.

చాలినంతవరకు డబ్బా రేకులతోనూ, మిగతాభాగం మేదరి చాపలతోనూ, అక్కడక్కడ చిరిగిన తాటాకులతోనూ, గేట్ల దగ్గర గోనె సంచులతోనూ పెండాలు తయ్యారయ్యాయి. టిక్కట్ల అమ్మకం వారంరోజులు ముందుగానే ప్రారంభించారు. జనులు సీట్లకోసం తొందరపడాలని. నటగ్రేసరుల పేర్లు వినటంవల్ల కాబోలు నిజంగానే ప్రేక్షకుల సంఖ్య అధికమైంది. యూనియన్‌బోర్డు, హైస్కూళ్ళసీట్లూ తెప్పించినా చోటు చాలే లక్షణం కనపళ్ళా. వసూలు నికరాదాయంలో 33 పరసెంటు టీ పార్టీ—నాచిపార్టీలకూ; $3\frac{1}{4}$ పరసెంటు తిరుణాల వూరు ఫీడింగుకూ; $1\frac{1}{8}$ పరసెంటు బీదవిద్యార్థుల సహాయార్థం వూళ్ళోపెద్దల జబర్దస్తీపెద్ద నిర్ణయించాడు యియ్యవలసిందిగా.

యివ్వాళ రాత్రికే ఆట. ఆశ్రయించుకొని వుండే అత్యంత విధేయులైన భక్తాగ్రేసరుల మొరలినో, లేక అవ్యాజకరుణా సముద్రత్వం తన నైజస్వభావం అవటంవల్లనో "నగరిలో నామూల సౌధంబులో" నుండి చొక్కా లేకపోవడం సరేగదా, చుట్టుకున్న సెమీధోవతి కూడా అస్తవ్యస్తంగా జీరాడుచుండగా వెలుపలికి వేంచేసి, నాటకాధికారిని పిలిపించాడు పైపెద్దలకు పెద్ద. వరసగా పేర్లూ, హోదాలూ చెబుతూ వూళ్ళోవుండే అభిమానస్థులైన జంభభేదిమొదలు, జయవిజయుల వరకూ నాటకానికి కాంప్లిమెంటరీ టిక్కెట్లు యివ్వడం అవసరమనీ, యీ సందర్భంలో ఫలానా ఫలానావారు మినహాగా క్లబ్బు సభ్యులందరిని మరవరాదనీ, నొక్కిచెప్పారు. నాటకాధికారికి లాభం గూబలోకి వచ్చేట్టుగా తోచింది. యేమన్నా అంటే బాబుగారి దివ్యశక్తులు ప్రకోపిస్తాయి. నలుదిశలా మాటస్ఫోటకాదులు మిన్నుముడతాయి, వొక్క

క్షణంలో! మరి నాటకం యేం జరుగుతుంది? 'మింగరాని కడి' అవడంవల్ల నోరు నొక్కేసుకొని సెలవుతీసుకున్నాడు నాటకాధికారి చివరికి.

"వెధవడబ్బు సొంది సంపాయిస్తుంది. డబ్బుకి యిక్కడ యెవడు కేరు చేస్తున్నాడు. చూడదల్చుకుంటే యెడంచేత్తో పారెయ్యాలి—మరీ—చూడాలి. కాని యీ బోడిముండ వ్యవహారం యెందుకు? యే అష్టావధానమైనా—యే పాటకచేరీ అయినా—యే దొమ్మరాటయినా అగ్రస్థానం తమది, చందాల పట్టీల్లో అగ్రస్థానం మందీ! వీటన్నిట్లో కమీషనుకూడా వుందో యేం పాడో. మొదట్నుంచీ నాకనుమానమే. యీసారి భవిష్యం బట్టబయలైంది. మనకేం గౌరవం....మర్యాదాలేదా? నిరక్షరాస్యులమా? దేంట్లో తక్కువ? అలావుండి యీ అగౌరవం యేమిటి? యిది అతగాడు కావాలనేచేశాడు." అన్నాడు పళ్ళుకొరుకుతూ, నిప్పుల్లాంటి కళ్ళతో పంతులు. "తెలిసి తెలిసి మనం తిరిగి వాళ్ళ తోకలవెంట తిరగడంకంటే అవమానంలేదు" అన్నాడు రెడ్డి. ముఖం చిటచిట్లాడించుకుంటూ. "దెబ్బకు దెబ్బ తీయాలి" అన్నాడు అయ్యర్. "ఆల్ మానం—మనం అంద్రం అప్పర్ క్లాస్ టిక్కట్లు కొని, సీట్లులేకుండాచెయ్యాలె" అన్నాడు సాయిబు. అంతవరకూ మౌనంగావున్న మొదల్యారు "దట్స్‌గూడ్" అంటూ లేచి "సింగూ, మనకుర్చీలూ, బెంచీలూ యావత్తూ తెచ్చి గదుల్లోవేసేసేయ్! బ్రహ్మదేవుడొచ్చినా మాటవినకు" అన్నాడు సరోషంగా. అందరూ లేచారు.

బూరవాగింది. సూర్యాస్తమయం అయింది. దీపాలుపెట్టారు. ఆట ప్రారంభం తొమ్మిదింటికి, కాని యేడున్నరకే కుర్చీలూ బెంచీలూ నిండిపొయ్యాయి విద్యార్థులతో. 9½కి పెద్దలూ, చిన్నలూ వచ్చేశారు. చోటా లేదు. అబ్బాయిగార్లను లెమ్మన్నారు కొందరు. మరి కొందరు గుడ్లురిమారు. యింక కొందరు ప్రొప్రయిటరుమీదికి ధ్వజం యెత్తారు. కాని అబ్బాయీలా వొట్టివాళ్లుకారు, వూళ్ళో ఆనైన వారిబిడ్డలు. యేదిచెయ్యాలి? యేదిమానాలి? వాళ్ళా తలలైనా తిప్పిచూళ్ళా. పరిస్థితులు డైలమాదాటి, విషమించాయి. కొందరు పెద్దలు మొఖాలు కందగడ్డల్లాచేసుకొని వెనక్కితిరిగారు. నాటకాధికార్ల ప్రాణాలు ఎగిరిపొయ్యాయి. కాళ్ళూ కడుపులూ పట్టుకొని, బజార్లవెంట మనుషుల్నితరిమి, వో పక్కగా యింత అరేంజిమెంటు చెయ్యగలిగారు చివరకి.

ఆట సాగింది. మధ్యమధ్య గలభాలతో ముగిసింది. కాని యేది యెలావున్నా నటకుల నటనాకౌశలం అత్యద్భుతంగావుందని అందరూ సంతోషించారు.

భూకంపం ప్రాయికంగారాదు. వొస్తే వూరికేపోదు, రోజులూ నెలలూ గడుస్తున్నాయి. యీ పీకులాట కారణంగా 'యేదొచ్చినా మనచెడ్డకే' అనుకునేపంతుళ్ళు వగైరా చాలామంది పంతం పట్టినట్టు వొక్కేసారిగా క్లబ్బుకు రావడం మానేశారు. అదివరకే మూలుగుతున్న నక్కమీద పెద్ద వో తాటికాయ వచ్చి పడిపోయింది. కస్టమర్సు లేకపోవడంవల్ల దీపాలనంబరూ, వాటికయ్యే నూనెఖర్చూ తగ్గింది. యింతవరకు మంచిదే, కాని మూడునెల్లవరకూ చూచి జీతం—భత్యం వొచ్చేమార్గం కనబడకపోవడంవల్ల టెయిలరింగ్ నేర్చుకోటానికని ఖాదరు తన రాజీనామా దాఖలుచేసుకున్నాడు. పోర్టబుల్ దుకాణదారు బాబ్చాకు ఖాతా మాత్రం ఘనంగానేవుంటూ వొచ్చిందిగాని, కళ్ళచూద్దామంటే కాసుగూడా గళ్ళాపెట్టెలో పడ్డం మానింది. వున్నబాకీలని ముఖమాటం చొప్పునో, భయభక్తుల చొప్పునో అడిగి వసూలుచేసుకునే పిండశక్తి లేకపోయింది. అంచాత "యిదికాదురా!" అని అంగడిని చౌకుదగ్గరికి మార్చేశాడు.

యే కారణంవల్లనో క్రమంగా క్లబ్బుకు రావడమే మానేశారు అందరూ. బాబ్చావంటి పరమమిత్రుడు వెళ్ళిపోవడమే కారణమన్నీ కొందరూ ఖాదరు వియోగమే కారణమని కొందరూ అనుకోడానికేమో అనుకున్నారు. యిందులో నిజమెంతో తెలీదు.

మంచో చెడ్డో అయిందేమో అయింది. కాని ఆ క్లబ్బు బిల్డింగుమాత్రం యిప్పుడు సర్వజనోపయోగకరంగావుంది. అవూళ్ళో లాడ్జింగ్సుయిచ్చే హోటల్సులేవు. అంచేత బిజినెస్‌మీదా—అన్యకార్యాలమీదా వొస్తూ పోతూవుండే ముసాఫిర్లకి యెండకీ—వానకీ తలదాచుగోడానికి శరణాలయం అయింది. పాపం ముసాఫిర్లు దాన్నికట్టించిన దాతనూ, యీవిధంగా ఖాళీగావుంచిన సజ్జనుల్నీ, చల్లగా విశ్రాంతి తీసుకుంటూ వేనోళ్ళ కీర్తిస్తున్నారు యిప్పటికీ. అయినా దేశసౌభాగ్యానికి కారకులైన భిక్షగాండ్లకి దాంట్లో యింతవరకూ ప్రవేశం కలక్కపోవడం చాలా చాలా విచారణీయం.

శ్రీ జీవా [స్టమక్ పవుడర్ ఆపరేషన్ లేనిది] సకలవిధ కడుపునొప్పులున్ను Appendicitis అను కడుపునందు ఏర్పడు వ్యాదినిన్ని కడుపునందు గలుగు రణములు, గడ్డలు మొదలగువాటిని కడుపును ఆపరేషన్ చేయకనే ఈ ఔషధము వుత్తరవాదముతో గుణపరుచును. ఈ ఔషధమును మళయాళ అష్టాంగవిదాయకమున మిక్కిలి ప్రయాసపడి తయారు చేయబడినది. ఈ ఔషధము, అల్‌సర్, మలబంధం, పుల్లతేనుపు పేగులద్వార కలుగు అనేకవిధవాధ్యులు, గున్మం, భోజనమునకు మునుపో లేక తరువాతనో గలుగు కడుపునొప్పి మొదలగు అనేకవిద సంకటములను కండితముగా గుణపరుచును. దీనివిషయమై విశేషముగా చెప్పనేల ఒకతూరి తెప్పించి బుజించిన యదార్ధము తెలుసును, సుఖపడవచ్చును, 30 దినములు 60 పూటలమందు క్రియం 2—8—6

ధనలక్ష్మి అండుకో., నెం. 6 లాయర్, చిన్నతంబి మొదలివీధి. సౌకార్ పేట మదరాసు.